ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

జోరుగా...హుషారుగా...

- గన్నవరం నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర
- కుల వృత్తిదారులతో ముఖాముఖి
- నేడు బహిరంగ సభ



విమానాశ్రయం వద్ద భారీ గజమాలతో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - గన్నవరం : టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 190వ రోజు సోమవారం గన్నవరం నియోజకవర్గంలో సాగింది. జాతీయ రహదారిపై 12 కిలోమీటర్ల పొడవునా జాతరలాగా ముందుకు సాగిన ఈ యాత్రలో లోకేష్‌తోపాటు టిడిపిలో చేరిన వైసిపి నేత యార్లగడ్డ వెంకట్రావు కూడా ఉన్నారు. యాత్రలో యువకులు జోరుగా.. హుషారుగా సందడి చేశారు. యాత్ర మోడల్ డైరీ వద్దకు రాగానే అందులో పనిచేస్తున్న మహిళలు బయటకు వచ్చి లోకేష్‌కు కరచాలనం చేశారు. సెల్ఫీలు దిగారు. ఆ తర్వాత గూడవల్లి సెంటర్లో టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. కేసరపల్లి వద్ద బాణాసంచా కాల్చారు. నినాదాలతో హోరెత్తించారు. భారీ గజమాలలు, పూలవర్షంతో ముంచెత్తారు. తీన్మార్ డప్పుల కోలాహలం, యువగళం జెండాలతో యాత్ర ముందుకు సాగింది. ఆ తర్వాత గన్నవరం కొత్తపేట సెంటర్లో టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. లోకేష్ జిందాబాద్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన లోకేష్ దృష్టికి వినతిపత్రాల రూపంలో తీసుకువెళ్లారు. టిడిపి హయాంలో తమకు అన్ని రకాలుగా న్యాయం జరిగిందని, వైసిపి వచ్చిన తర్వాత తీరని అన్యాయం జరిగిందని భవన నిర్మాణ కార్మికులు విన్నవించారు. విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు వినతిపత్రం అందించారు. చివరగా గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో న్యాయవాదులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ పాదయాత్రలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమా, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, ఎంఎల్‌సి అనురాధ, మాజీ ఎంఎల్‌ఎ బోడె ప్రసాద్, టిడిపి గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మరోవైపు గన్నవరం ఎంఎల్‌ఎ వంశీమోహన్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని సిఐ కనకారావు తెలిపారు.

కుల వృత్తుల ఎగ్జిబిషన్ ఏర్పాటు

తొలుత నిడమానూరు శివారు క్యాంప్ సైట్‌లో బిసి కులవృత్తిదారులతో లోకేష్ ముఖాముక్షి నిర్వహించారు. ఈ సందర్భంగా రజక, గీత వృత్తి దారులు ఆయనకు తమ సమస్యలు విన్నవించారు. వివిధ చేతివృత్తుల ప్రదర్శన నిర్వహించారు. దీనిని లోకేష్ ఆసక్తిగా తిలకించారు.

నేడు గన్నవరంలో బహిరంగ సభ

యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరంలో భారీ బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభలో లోకేష్‌తోపాటు ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

ప్రజాశక్తి - విజయవాడ : సమావేశంలో ప్రవేశపెట్టిన అన్ని అంశాలను విజయవాడ నగరపాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం ఆమోదించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం స్థాయీ సంఘ సమావేశం జరిగింది. విజయవాడ నగరపాలక సంస్థ వర్క్స్ ప్రాజెక్టు డివిజన్-2 ఇంజినీరింగ్ విభాగంలో 2021 ఫిబ్రవరి 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకు రూ.5 లక్షలలోపు నామినేషన్ పద్ధతిలో ఆమోదం పొందిన 54 అత్యవసర పనులను ఆమోదించింది. అలాగే వర్క్స్ డివిజన్ -3 పరిధిలోని రాణిగారితోట 18వ డివిజన్‌లో ఉన్న మాదంశెట్టి సీతయ్య వీధి మెయిన్ రోడ్డు, క్రాస్ రోడ్డులో కొత్తగా డ్రైనేజి లైన్, వాటర్‌పైప్‌లైన్ వేయడం వల్ల దెబ్బతిన్న సిసి రోడ్డు నిర్మాణానికి రూ.43.70 లక్షలను సాధారణ నిధుల ద్వారా మంజూరు చేసింది. కొత్త ఆర్‌ఆర్‌పేట, 57వ డివిజన్ జీఓ బల్బ్ రైల్వే ట్రాక్ నుంచి బుడమేరు రైల్వే బ్రిడ్జి వరకు రైల్వే ట్రాక్ వెంబడి ఆర్‌సిసి స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి రూ.1.98 కోట్ల అంచనా విలువతో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ పనులను నాలుగు భాగాలుగా విభజించిన నేపథ్యంలో సుబ్బరాజు నగర్ మొదటి లైన్ నుంచి ఇదే నగర్‌లోని కొత్త ఆర్‌ఆర్‌పేటలోని పార్క్ వరకు డ్రైన్ నిర్మాణానికి రూ.49.70 లక్షల అంచనా వ్యయాన్ని విఎంసి సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి పరిపాలనా పరమైన అనుమతి మంజూరు చేసింది. విఎంసి ప్రధాన కార్యాలయ నూతన భవనం మొదటి అంతస్తును విఎంసి వినియోగానికిగానీ, బయట సంస్థలకు లీజుకుగానీ ఇవ్వడానికిగానీ అవసరమైన పనులు చేపట్టడానికి అయ్యే రూ.49.95 లక్షలు, అలాగే మూడో అంతస్తు పనులను అయ్యే రూ.49.95 లక్షలను సాధారణ నిధుల నుండి ఖర్చు చేయడానికి ఆమోదించింది. విఎంసికి చెందిన ఎన్‌టిఆర్ కాంప్లెక్స్‌లోని సెల్లార్, ఎన్‌టిఆర్- ఎంఎంసి మధ్య ఉన్న ప్రదేశంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసే లీజు మొత్తంపై 11.11 శాతం అదనంగా పెంచి రూ.74.18 లక్షలు చెల్లించే పద్ధతిపై వచ్చే ఏడాది అక్టోబర్ 6వ తేదీ వరకు గడువు పెంచుతూ తీర్మానించింది. సర్కిల్-3 పరిధిలోని మూడో డివిజన్లో దేవబత్తుల భగవంతురావు వీధి, కనెగంటి బసవపున్నయ్య వీధి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.49.90 లక్షల అంచనా వ్యయాన్ని ఖర్చు చేయడానికి కూడా ఆమోదించింది. ఈసమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు తాటిపర్తి కొండారెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, మోదుగుల తీరుపతమ్మ, బంకా శకుంతల, ఇన్చార్జి ఎసిజి, యుసిడి పిఒ కె.శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) కెవి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు వైసిపి బైక్ ర్యాలీలు

ప్రజాశక్తి-భవానీపురం: ఈ నెల 23వ తేదీన విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో భారీ బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.



భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయంలో వైనాట్ 175 ర్యాలీ పోస్టర్‌ను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్‌లతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి, విష్ణు మాట్లాడుతూ వన్‌టౌన్ రథం సెంటర్ నుంచి బెంజిసర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహిస్తామని, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ నియోజకవర్గ కార్యకర్తలందరూ ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు అడపా శేషు, తోలేటి శ్రీకాంత్, కూరపాటి గీతాంజలి, మనోజ్ కొఠారి, పైలా సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

28న వాహనాలకు వేలం

ప్రజాశక్తి-తిరువూరు: ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలకు ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ తిరువూరు స్టేషన్ సిఐ గురవయ్య తెలిపారు. 18 వాహనాలకు తిరువూరు స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు.

లోకేష్ సభను జయప్రదం చేయండి : టిడిపి


ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో గిద్ద లూరు మాజీ ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దొంతు చిన్న మరియు ముఖ్య నేతలతో కలిసి రాజగోపాల్ సోమవారం పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ఏ ప్రాంతానికి వెళ్లిన ఆ ప్రాంత ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మంగళవారం గన్నవరంలో జరిగే భారీ బహిరంగ సభకు జగ్గయ్యపేట నియోజకవర్గం నుండి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.

సచివాలయ కన్వీనర్లే పార్టీకి బలగం : సామినేని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైఎస్సార్ సీపీకి సచివాలయ కన్వీనర్లు, గహసారథులే అతిపెద్ద బలగమని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణం శాంతి నగర్ బి కన్వెన్షన్ నందు జగ్గయ్యపేట నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్లతో ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, రాష్ట్ర జేసీఎస్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీ తమ కార్యకర్తకు ఇవ్వని విధంగా వైఎస్సార్ సీపీ గహసారథుల దగ్గర నుంచి సచివాలయ కన్వీనర్ల వరకు బీమాను వర్తింపజేస్తోందన్నారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల బీమాతో పాటు వైద్యం నిమిత్తం కొంత సాయం అందిస్తున్నట్టు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లనే తన సైనికులుగా గుర్తించి, ప్రజాసంగ్రామంలోకి వస్తున్నారన్నారని అన్నారు. 2024లో టీడీపీ గెలిచే పరిస్థితి లేదన్నారు. టీడీపీ గతంలో ప్రజలకు ఏమి చేసిందో చెప్పుకోలేని దుస్థితిలో ఉందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలంలోని అడవిరావులపాడు "గడపగడపకు- మన ప్రభుత్వం" నిధులు రూ.12 లక్షలతో నూతనంగా చేపట్టనున్న పలు అభివద్ధి పనులకు శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అర్జీల పరిష్కారానికి చర్యలు : జెసి



అర్జీలను స్వీకరిస్తున్న జెసి సంపత్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ

అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి సంపత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డా.పి.సపంత్ కుమార్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి 140 వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో వస్తుంటారని, వారి ఆశలను ఒమ్ము చేయకుండా అర్జీల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో అర్జీలు సమర్పిస్తారన్నారు. వాటిని పరిష్కరించాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు. స్పందనలో ఎక్కువగా నమోదవుతున్న వినతులను, అంశాలను విశ్లేషించుకోవడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు పునరావతం కాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విఎంసి స్పందనకు 12 అర్జీలు

అర్జీలు పారదర్శకంగా పరిష్కరించడానికి ఆయా విభాగాల అధికారులు కృషి చేయాలని అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) కె సత్యవతి అన్నారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్‌తో కలిసి ఎసి (ప్రాజెక్ట్సు) సత్యవతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి 12 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) సత్యవతి మాట్లాడుతూ ప్రజల సమస్యల వివరాలు అడిగి తెలుసుకొని వచ్చిన అర్జీలు అన్నియు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నగరపాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడిసిపికి 92 ఫిర్యాదులు

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్ఒలను అడిషనల్ డిప్యూటీ పోలీసు కమిషనర్ పి వెంకటరత్నం ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుండి 12.30 గంటల వరకు ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో జరిగింది. అడిషనల్ డిప్యూటి పోలీస్ కమిషనర్ పి.వెంకటరత్నం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి 92 ఫిర్యాదులు స్వీకరించారు.

లడ్డూ పోటును పరిశీలించిన కర్నాటి

ప్రజాశక్తి-వన్‌టౌన్

దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదాల తయారీ, లడ్డూ పోటును ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు సోమవారం పరిశీలించారు. దేవస్థానం యొక్క ప్రసాదం తయారీ లడ్డుపోటును, భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందించే విధంగా అక్కడ సరుకులను పరిశీలించి, ప్రసాదాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీకి వినియోగించే పాత్రలు, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులందరూ అమ్మవారి పట్ల భక్తి భావంతో ఉండాలని తెలియజేశారు. మరీ ముఖ్యంగా పదార్థాలు తయారు చేసే ప్రదేశంలో వేడి బయటకు వెళ్లే విధంగా మెస్సులు మరియు ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగపు అధికారులను ఆదేశించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సదుపాయాలు కల్పించాలని ప్రసాదాల తయారీ కాంట్రాక్టర్ వారికి తెలియజేశారు. ప్రసాదాల తయారీలో విధులు నిర్వర్తించే సిబ్బంది అందరూ పూర్తి పరిశుభ్రతతో మెలగాలని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తలకు టోపీ, చేతికి గ్లౌజులు ధరించాలని ఆ విధంగా అందరూ ఉండేలాగా చూసుకోవాల్సిందిగా ప్రసాదం తయారీపోటు అధికారులుకు సూచనలు ఇచ్చారు. శ్రీ అమ్మవారి దేవస్థానంలో పులిహోర ప్రసాదంకు అత్యంత ఆదరణ ఉందని, కాబట్టి పులిహోర నాణ్యత ఎట్టి పరిస్థితులను తగ్గకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజనీర్ రమాదేవి, లడ్డు పోటు పర్యవేక్షణ అధికారి జగదీష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



లడ్డూ పోటును పరిశీలిస్తున్న ఛైర్మన్ కర్నాటి రాంబాబు

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త మాదు శ్రీనివాసరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం పార్టీ గ్రామశాఖ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఇటీవల జరిగిన తొమ్మిదో వార్డు ఉప ఎన్నికలో అభ్యర్థి వల్లూరు వెంకట శివ విజయం కోసం కష్టపడి పని చేసిన మాదు శ్రీనివాసరావు స్వల్ప అస్వస్థకు గురయ్యారు. వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన శ్రీనివాసరావును పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాదు శివరామప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షుడు, పంచాయతీ 7వ వార్డు సభ్యుడు గంపా శ్రీనివాస్ యాదవ్, 9వ వార్డు సభ్యుడు వల్లూరు వెంకట శివ సోమవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను నాయకులు శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు గన్నవరం నియోజకవర్గం నాయకుడు పామర్తి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

23న విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

కన్స్యూమర్స్ గ్రీవెన్సస్ రెడ్రసెల్ ఫోరం (సిజిఆర్‌ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు ఆగస్టు 23న నిర్వహించనున్నట్లు విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిబి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇబ్రహీంపట్నం లో గల విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌలు రైతు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-నందిగామ

మండలంలోని కొణతమాత్మకురు గ్రామంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకొన్న కుటుంభానికి కిసాన్ శ్రామిక్ స్కాంగ్ ద్వారా ఆర్థిక సహాయం దాతలు అందజేశారు. గ్రామంలో గండే పల్లి బ్రహ్మయ్య (70) కౌలు రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కిసాన్ శ్రామిక్ వ్యవస్థాపకులు సిఐ గురునాథం అధ్వర్యంలో మజ్జి మేఘన,వీఎస్పీ సిమెంట్స్ ఫణి,కమిటీ మెంబర్ రాజా,సిమెంట్ ప్రసాద్ లు సోమవారం నాడు నందిగామ కెఎమ్మార్ హాస్పిటల్‌లో వైద్య సహాయంలో ఉన్న అయన భార్య భద్రమ్మ కు పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న యువి రామరాజు

విజేతలకు బహుమతులు

విజయవాడ : అమరావతి బాలోత్సవం, విశ్వమానవ సంక్షేమ సంఘాల సహకారంతో విజయవాడ మాచవరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో 'పూలే-అంబేద్కర్ పత్రిక అధ్యయన కేంద్రం' నిర్వహిస్తున్న ట్యూషన్ పాయింట్ పిల్లలు ఆగస్టు 15 సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అమరావతి బాలోత్సవం బాధ్యులు యువి రామరాజు అందజేశారు. ఎనిమిది రకాల ఆటల్లో 35 మంది పిల్లలు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్యూషన్ నిర్వాహకులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు, టీచర్ కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎండిఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయి మండలంలోని పెద్ద మోదుగు పల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మండల పరిషత్ అధికారి చెన్నారావు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటంపై ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల సంఘం నాయకులు ఎస్.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. పెద్ద మోదుగుపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండల పరిషత్ అధికారి చెన్నారావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తెలిపారు. ఎన్నికల నిబంధనలను పాటించని చెన్నారావుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా ప్రతినిధుల పట్ల అవమానకరంగా ప్రవర్తించిన ఎంపీడీవో చెన్నారావును సస్పెండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు ముత్యాల సైదేశ్వరరావు, కట్టా గురవయ్య, ఐజే కోటయ్య, బుర్రి వెంకట్ డిమాండ్ చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా గోపినాయక్, వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా సమావేశాలు రెండు రోజులు పాటు ఎం.బి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ ప్లీనరీ సమావేశాలలో ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని 19 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ప్లీనరీ సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ విధారంగాన్ని బలోపేతం చేయడానికి విద్యారంగానికి నిధులు కేటాయించాలని అన్నారు. కానీ ప్రభుత్వాలు పైకి గొప్పలు చెప్పుకుంటు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ నాడు నేడు పనులు పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాడు నేడు పనులు వేగవంతం చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శిగా చిమత వెంకటేశ్వరావు, అధ్యక్షులుగా గిగ్గులోతు గోపినాయక్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.సోమేశ్వరరావు, ఎం.కుమార్‌నాయక్, ఎస్.కే జాహిద ఎన్నికయ్యారు.



గోపినాయక్, వెంకటేశ్వరరావు

సమస్యలు పరిష్కరించడం ప్రథమ కర్తవ్యం: ఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తారని, వాటిని తీర్చడం మన ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల యొక్క సమస్యలు చట్టపరిధిలో పరిష్కరించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమస్యలు ఏవైనా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య తీవ్రత ఆధారంగా విచారణ జరిపి తగు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

స్పందనలోని కొన్ని ఫిర్యాదులు:

గన్నవరంకు చెందిన యువతి ఒక ప్రైవేట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తుంది. అయితే కాలేజీలో కొంత మంది యువకులు ర్యాగింగ్ చేస్తూ అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని, వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసినప్పటికీ మార్పు రాకపోగా ఇంటిపైకి వచ్చి పరువు తీసేలా వ్యవహరిస్తున్నారని తన ఫిర్యాదులో పేర్కొంది. రక్షణ కల్పించి న్యాయం చేయవలసిందిగా ఎస్పీని కోరింది. అలాగే తాడిగడపలో నివాసముంటున్న ఓ వివాహితకు పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కేవలం రెండు నెలలు మాత్రమే సజావుగా సాగిన తన కాపురంలో అత్తమామలు, భర్త అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని ఫిర్యాదు చేసింది. అంతే కాక ఫోను హ్యాక్ చేసి తన తల్లిదండ్రులతో మాట్లాడే మాటలను వింటూ గర్భవతి అని చూడకుండా అత్తింటి వారు కొట్టారని అవేదన వ్యక్తం చేసింది. అడిగినంత కట్నం తీసుకు రాకుంటే మరొక వివాహం చేస్తామని బెదిరిస్తున్నారని న్యాయం చేయమని ఎస్పీని కోరింది. అలాగే గూడూరులో నివాసముంటున్న మహిళకు పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే భర్త వ్యసనాలన్నీటిని దాచి అబద్ధాలు చెప్పి వివాహం చేశారని, సంవత్సరం తిరిగే నాటికి ఆదరణ పథకం, అదనపు కట్నం కోసం అత్తమామలు వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త దుర్వ్యసనాలు క్రమంగా బయటపడుతున్నాయని, నిలదీస్తుంటే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అవేదన వ్యక్తం చేసింది.



సమస్యలు వింటున్న ఎస్‌పి జాషువా

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత



ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం మచిలీపట్నం మండల పరిధిలో 33 వేల ఎకరాలు భూమి సేకరణకు కొత్త జీవో తీసుకువచ్చినందుకు నిరసనగా సిపిఎం నాయకులు గ్రామ సభలను బహిష్కరించిన నేపథ్యంలో పోలీసులు పెట్టిన కేసులను కోర్టు కొట్టివేసింది. సిపిఎం పార్టీ నాయకుల మీద తప్పుడు కేసులు బనాయించి గత తొమ్మిది సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిప్పారు. సోమవారం కొడాలి శర్మ, చౌటుపల్లి రవి, పిప్పళ నాగబాబు, చిరువోలు జయరావు, కొల్లాటి శ్రీనివాసరావు ,పిప్పళ్ళ తిరుమలరావులపై కేసు పూర్వాపరాలు పరిశీలించి న్యాయ స్థానంలో న్యాయమూర్తి ఈ కేసు కొట్టి వేశారు. ఈ కేసు ను ప్రముఖ లాయరు వేము కోటేశ్వరరావు వాదించారు.

రహదారి అధ్వానం



ప్రజాశక్తి-ఘంటసాల : మండల కేంద్రమైన ఘంటసాల గ్రామంలోని ఘోటకం-బి కాలనీలో రహదారిని అభివృద్ధి పర చాలని ప్రజలు కోరు తున్నారు. వర్షాకాలంలో మోకాళ్ళ లోతు బురద మాయమైన రోడ్లలో పిల్లలు స్కూల్ కు వెళ్లేందుకు కూడా నడవలేని పరిస్థితిలో రహదారి ఉండడంతో అవస్థలు పడుతున్నా మని అంటున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఈ రహదారిలో వచ్చినప్పుడు తమ గోడు విన్నవించుకున్నట్లు తెలిపారు. వర్షం వస్తే రహదారి బురదమయంగా మారి అడుగులో అడుగు వేసుకుంటూ బయటికి వెళ్ళవలసి వస్తుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారిని అభివద్ధి పరచాలని కోరుతున్నారు.

బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ



ప్రజాశక్తి-గన్నవరం : గుడివాడ ఉప విద్య శాఖధికారి ఐ. వెంకట పద్మరాణి సోమవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గన్నవరం మండల విద్య శాఖధికారిణి ఆర్. కమల పాల్గొన్నారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల సంఖ్య, ప్రోగ్రస్ రిపోర్టులు పరిశీలించి వెంకట పద్మరాణి సంతప్తి వ్యక్తం చేశారు. తర్వాత పిల్లలతో ఇంట్రాక్షన్ అయ్యారు. పాఠ్యంశాలలో అంశాలలో పిల్లల శక్తి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని ఉన్నారు..

వైసిపి మండలాధ్యక్షుడి నియామకం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా అనిగిండ్లపాడు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కనకపుడి భాస్కరరావుని సోమవారం నియమించారు. జగ్గయ్యపేట పట్టణంలో బి కన్విక్షన్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం స్థాయిలో మండల పార్టీల మార్పులు చేర్పులు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే సచివాలయం కన్వీనర్ల ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పెనుగంచిప్రోలు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా కనకపుడి భాస్కరరావును నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితాలు ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం చేపట్టామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ , ఇంటింటి సర్వేలో ఓటర్ల జాబితాలలో గుర్తించిన వ్యత్యాసాలను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టి, 2023 అక్టోబర్ 17 తేదీ నాటికి సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితాలు ప్రచురించడం జరుగుతుందన్నారు. ఆ జాబితా పై అక్టోబర్ 17 నుండి నవంబర్ 30 తేదీ వరకు క్లేయిమ్ లు అభ్యంతరాలు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 28, 29 తేదీలతోపాటు నవంబర్ 18, 19 తేదీల్లో (ఆదివారాలు, శనివారాలు) పోలింగ్ కేంద్రాల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహించి ఓటర్ల జాబితాలలో మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 26 నాటికి క్లైయిములు అభ్యంతరాల పరిష్కరించి 2024 జనవరి 5 వ తేదీ నాటికి ఫోటో ఓటర్ల తుది జాబితాలు ప్రచురించడం జరుగుతుం దన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఎక్కువగా నమోదు కావాలని ప్రజాస్వామ్యం బలోపేతం గావించుటలో భాగస్వామ్యం కావాలన్నారు.

వృద్ధులకు సత్కారం

ప్రజాశక్తి ఉయ్యూరు : పెద్దలను గౌరవించి వారి అనుభవ పాఠాల నుండి మంచిని నేర్చుకుని ఉన్నత స్థాయికి యువత బాటలు వేసుకోవాలని ఉయ్యూరు ఆర్టీసీ డిపోమేనేజర్ కెఎస్ఆర్కె ప్రసాద్ అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని లయన్సబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్ స్టాండ్ ఆవరణలో ప్రయాణికుల నడుమ వద్ధులను ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రైతుబజార్లో కూరగాయాలు విక్రయించే వద్ధులతో పాటు పలువురిని ఉచిత రీతిన సత్కరించి పండ్లు పంపిణీచేశారు. క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపట్టిన సేవా కార్యాక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని భాగస్వాములు చేయడం ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు విన్నూత్నంగా ముందుకు వెళుతున్నామన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవాకార్యక్రమాలను క్లబ్ జిల్లా కేబినేట్ ట్రె జరర్ నూకల సాంబశి వరావు అభినందిచి తనవంతు సహాయ సహకారాలు అందిసా నని ప్రకటించారు. పూర కిషోర్, నెల్లిరాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు కుర్చీలు బహూకరణ



కుర్చీలు బహూకరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని దేవరపల్లి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో సోమవారం పీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు ఆరు కుర్చీలు, 53 మంది విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్ బహు కరించారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి చేతుల మీదగా పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ మధుసూ దనరావుకు కుర్చీలను అందించారు. పీస్ సేవా సంస్థ చైర్మన్ గుడివాడ నిరంజని, అధ్యక్షులు జి.ప్రశాంత్ లు విద్యార్థినీ విద్యార్థులకు పెన్నులు పెన్సిళ్లు పంపిణీ చేశారు. సర్పంచి మరిది వెంకటేశ్వరరావు ఈ సంస్థ చేస్తున్న మంచి పనులను అభినందించి, ముందు ముందు మరెన్నో ఉపయోగకర పనులు ఈ సంస్థ ద్వారా చేయాలని నిరంజనిని కోరారు. ఉపాధ్యాయినీలు చంద్రకళ, హారిక, గ్రామస్తులు బాబురావు, గుంటకాని లాజరు, దేవరపల్లి రామారావు, బసవరాజు, పాస్టర్ బుజ్జి బాబు, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి పిఎస్ రాజు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఇటీవలకాలంలో వర్షాల వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో వాటి నిర్మూలనపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో ఇన్ చార్జి ఎండిఒ పి.శైలాజా కుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పిఎస్ రాజు మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వలు ఎక్కువుగా ఉంటాయన్నారు. కాబట్టి ఆ నీటిలో దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉందన్నారు. అందువలన ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరిబొండాలు, ఖాళీ గాజుసీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు మొదలైన వాటిని లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డే డ్రైడే గా పాటించాలని సూచించారు. దోమల నివారణలో భాగంగా అవసరమైన చోట దోమలమందు పిచికారి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని గ్రామ కార్యదర్శులకు, సిబ్బందికి ఎండిఒ సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్ఒ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

పెడన విద్యార్థికి మెడికల్ సీటు



ప్రజాశక్తి-పెడన : మచిలీపట్నంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలలో పెడన పట్టణంలోని ఐదో వార్డు చెందిన అబ్దుల్ రిజ్వాన్ ఎంబిబిఎస్ సీటు సాధించాడు. దాదాగుంట ప్రాంతంలోని మున్షిఅబ్దుల్ రహీం వీధిలో నివసించే విశ్రాంత మిలటరీ ఉద్యోగి అబ్దుల్ రహీం కుమారుడు అబ్దుల్ రిజ్వాన్ నీట్ అల్ ఇండియా పరీక్షలో జాతీయస్థాయి ర్యాంక్ 1,13101, రాష్ట్రస్థాయిలో 4805 ర్యాంక్ సాధించాడు. భారతదేశ వ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తే దానిలో ఉత్తమ మార్కులు సాధించి మొదటి కౌన్సిలింగ్ లో మచిలీపట్నం సీటు వచ్చిందని విద్యార్థి తండ్రి అబ్దుల్ రహీం మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. విద్యార్థి రిజ్వాన్ తండ్రి భారతదేశం సైనిక రంగంలో సేవలందించి పదవి విరమణ పొందారు. తల్లి ఫాతిమాబి గుడ్లవల్లేరు మండలం ఉలువలపూడి ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

హిమజకు కాంస్య పతకం



ప్రజాశక్తి ఉయ్యూరు : ఉభయ తెలుగురాష్ట్రాల పరిధిలో తిరుపతిలో ఇటీవల నిర్వహించిన ఎన్‌సిసి సైనిక్ ఇంటర్ గ్రూప్ శిబిరంలో ఏజీఅండ్ సీజీఎస్ కళాశాల విద్యార్థిని బి. హిమజ ఫైరింగ్ విభాగంలో తతీయ స్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించి దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న శిబిరంలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈసందర్భంగా కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పతకం సాధించిన హిమజతో పాటు ఎన్సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్ ను అభినందించారు.

రైల్వే కార్మికులకు మద్దతుగా సిఐటియు ధర్నా

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ రైల్వే స్టేషన్లో 15 ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రక్షక్ పద్మావతి కాంట్రాక్టు సంస్థలు తొలగించటాన్ని నిరసిస్తూ పాత కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే డిఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు అనుబంధ సంఘాలైన వివిధ యూనియన్ల నాయకులు పాల్గొని రైల్వే కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అన్యాయంగా కార్మికులను పని నుండి తొలగించారని అన్నారు. పని కోల్పోయిన కార్మికులు నెల రోజులుగా పోరాటం చేస్తుంటే మాటలు చెబుతున్న రైల్వే అధికారులు చేతల్లో ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని, సీనియారిటీ ఉన్న కార్మికులను పనిలో పెట్టించి కొత్తగా చేర్చుకున్న కార్మికులను పనిలో ఆపేయాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ శుభ్రంగా ఉండాలంటే కాంట్రాక్టర్ ఇప్పుడు చేయిస్తున్న 80 మందితో సాధ్యం కాదని తెలిపారు. కావున పాత కార్మికులందరినీ పనిలో నియమించుకుని న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహులు. ఏ వెంకటేశ్వరరావు, బాబూరావు, సుధాకర్, కోటి, బాబు, ఇ.వి. నారాయణ, ముఠా కార్మిక నాయకుడు వెంకట్రావు, ఎస్.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఐద్వా కార్యదర్శి కె. శ్రీదేవి, గాదె ఆదిలక్ష్మి, శ్రామిక మహిళా కన్వీనర్ కమల మద్దతు తెలిపారు.



రైల్వే కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న సిపిఎం, సిఐటియు, ఐద్వా నాయకులు

పంట రుణాలు పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సహకార సంఘాలు బలోపేతం అయ్యాయని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక సొసైటీ ద్వారా రూ.1.5 కోట్ల పంట రుణాలను సోమవారం చెక్కుల రూపంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థిక పరిపుష్టికి సొసైటీలు చేయూతనందిస్తాయని అన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : ఉమా


ప్రజాశక్తి-తిరువూరు: నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. టిడిపి తిరువూరు నియోజవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శావల దేవదత్తుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టు పనులు నిలిచిపోయాన న్నారు. ఎన్ఎస్‌పి కాలువల్లో పూడిక తీయించలేదన్నారు. రైతు పండిం చిన పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేని నిస్సాహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. తిరువూరు నియోజకవర్గంలో పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం అటకెక్కించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు.


మాట్లాడుతున్న దేవినేని ఉమా

ర్యాగింగ్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: దిశ యాప్ ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందుతుందని, ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించుకోవచ్చని మూడవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శాంతి అన్నారు. నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో ర్యాగింగ్‌ను అరికట్టేందుకు అవగాహనా కార్యక్రమం సోమవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల విద్యార్థి జీవితమే తారుమారు అయ్యే అవకాశం ఉందన్నారు. ప్యానెల్ న్యాయవాది పి.రాము మాట్లాడుతూ న్యాయ సహాయ సేవలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అదితిసింగ్

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: వైద్యాధికారులు స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసిపిఎన్డిటి యాక్ట్) నిబంధనల అమలును పరిశీలించాలని సబ్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిబంధనలను ఉల్లఘించినట్లు గుర్తిస్తే ఆయా సెంటర్ల లైసెన్సలను రద్దు చేసేందుకు వెనుకాడరాదన్నారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ సమాజంలో స్త్రీ పురుషుల నిష్పత్తిని కాపాడాలన్నారు. పుట్టబోయ్యే శిశువుల లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమనే విషయంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డియంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఇందుమతి, కమిటీ సభ్యులు రేడియాలజిస్ట్ డా. పివిఎస్ఆర్ మూర్తి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆనంద్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనిల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ జి.రేవతి పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళం

ప్రజాశక్తి-విజయవాడ

దేశం కోసం నిర్విరామంగా సేవలు అందిస్తూ విధి నిర్వహణలో అలుపెరగని పోరాటం చేస్తున్న అమర సైనిక కుటుంబాల సంక్షేమ నిధికి స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులు విరాళాలు అందించడం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు అందించిన 10 లక్షల రూపాయల చెక్‌ను నగరపాలక సంస్థ యుసిడి పివో కె.శకుంతల, డిఆర్‌డిఏ పిడి కె.శ్రీనివాసరావు జిల్లా సైనిక సంక్షేమ నిధికి జిల్లా కలెక్టర్ డిల్లీరావు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను అర్పించి అమర వీరులైన సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్‌హెచ్‌జి సభ్యులు

జెడ్ ఫ్లిప్-5 విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 5, జెడ్ ఫోల్డ్ 5 విక్రయాలను ప్రారంభించినట్లు సామ్‌సంగ్ షోరూమ్ ఏరియా ప్రతినిధి ఎం.ఎస్.కె.బాబూరావు తెలిపారు. నగరంలోని షోరూమ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివరాలను తెలియచేశారు. సరికొత్త ఫ్లెక్స్ విండోతో అల్టిమేట్ ప్యాకెట్ చేయదగిన సెల్ఫ్ ఎక్స్‌ప్రెషన్‌గా ఈ ఫోన్‌ను తీర్చిదిద్దారని తెలిపారు. జెడ్ ఫోల్డ్ 5 అనేది పెద్ద స్క్రీన్‌తో అల్టిమేట్ పవర్ హౌస్‌గా వినియోగారులకు సాటిలేని ఫోల్డబుల్ అనుభవాలను అందిస్తుందన్నారు. మొదటి 28 గంటల్లోనే లక్ష మంది వినియోగదారులు స్మార్ట్‌ఫోన్‌లను ముందుగా బుక్ చేసుకున్నారని తెలిపారు.

నేటి నుండి 'మిత్ర'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించే ఉద్దేశంలో భాగంగా ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మిత్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కెవి సత్యనారాయణ తెలిపారు. సూర్యరావుపేటలోని మిత్ర హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉచిత వైద్య శిబిరంకు సంబంధించిన వివరాలను హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కెవి సత్యనారాయణ వెల్లడించారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారికి ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా వివిధ రకాల రక్త పరీక్షలపై కూడా రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. తమ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రతిఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2, 3 తేదీలలో మంగళగిరి హ్యాపీ రిసార్ట్స్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పార్టీ అధినేత రామచంద్రయాదవ్ అన్నారు. జాబ్‌మేళాకు సంబంధించి నగరంలోని ఓ హోటల్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా జాబ్ మేళాను నిర్వహించి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్క రించాలనేది ప్రదాన ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 2, 3 తేదీలలో నిర్వహించే జాబ్‌మేళాలలో సుమారు 500 కంపెనీలు రానున్నాయని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల వయసు మధ్యలో ఉన్న వారు, పదో తరగతితో పాటు డిగ్రీ, పీజీ, కింజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, చదివిన నిరుద్యోగ అభ్యర్థులు తమకు కావాల్సిన ఉద్యోగం కోసం జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు.



రాయల్ బూమ్ బాక్స్ ఆల్బమ్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: సంగీత ప్రియుల కోసం రాయల్ సంస్థ బూమ్ బాక్స్ పేరుతో సరికొత్త సంగీత మ్యూజిక్ ఆడియోలను విడుదల చేసినట్లు సంస్థ ఇన్‌ఛార్జి అమిత్ త్రివేది ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటికపుడు సరికొత్త మ్యూజిక్ ఆల్బమ్‌లను అందించంలో రాయల్ సంస్థ ముందుంటుందని తెలియచేశారు. ఇందులో భాగంగానే ఆధునిక యుగపు యువ ప్రేక్షకులు ఉత్తేజకరమైన కొత్త సంగీత స్వరాలను అన్వేషించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని అన్నారు. దానికి అనుగుణంగా లివింగ్ ఇట్ లార్జ్ పేరుతో కొత్త మ్యూజిక్ వీడియోలను తీసుకువచ్చినట్లు తెలిపారు.

సందడిగా ఫ్రెషర్స్ డే వేడుకలు


ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థులు లక్ష్మీపురంలోని మను గార్డెన్లో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రతి విద్యార్థి తమ లక్ష్యానికి అనుగుణంగా చదవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేతలు ముత్యాల కిషోర్‌బాబు, పి.నాగేశ్వరావు పాల్గొన్నారు.



నాడునేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నాడు నేడు ఫేజ్-2లో భాగంగా ఐదు అదనపు తరగతి గదులకు 60 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పనులను ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అలాగే పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో 20, 22 వార్డులలో అద్దాల బజారు, బ్రాహ్మణ బజార్ల ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ జుబెర్, జిల్లా చేనేత విభాగం పెంటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కుంచాపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలోని ముక్త్యాల రోడ్డు పాలేటి ఒడ్డున డంపింగ్ యార్డ్‌లో 1.49 కోట్ల రూపాయలతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టిపి) కార్యక్రమానికి ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మానవ వ్యర్థాలతో ఎరువు తయారు చేయడానికి ఈ ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎరువు పంట పొలాలకు ఎంతో ఉపయోగకరమని, అదేవిధంగా నీటిని మొక్కల పెంపకానికి, కూరగాయల సాగుకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు.


నాడునేడు పనులను పరిశీలిస్తున్న ఉదయభాను

26, 27 తేదీల్లో సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు

- జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 26, 27 తేదీల్లో సిపిఎం పార్టీ జిల్లా శిక్షణా తరగతులు అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. సోమవారం అవనిగడ్డలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దేశంలో,రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తులో పార్టీ చేపట్టబోయే పోరాటాలు, ఉద్యమాలకు సంబంధించి ఆర్థిక, రాజకీయ,సామాజిక అంశాలపట్ల పార్టీ కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా పట్టణంలో డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఇంటింటికీ, వ్యాపార సముదాయాలకు వెళ్లి వారికి కరపత్రాలు అందజేసి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, వై.మధు, మురాల వెంకటేశ్వరరావు, శివనాగేంద్రం, బూర సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకులు అవుల బసవయ్య, కోడూరు మండల పార్టీ కార్యదర్శి పోలాబత్తిన మోహనరావు, మోపిదేవి మండల పార్టీ కార్యదర్శి బండి ఆదిశేషు, శీలం ప్రకాశం, రాజేష్, ఎస్.రాజేష్,కరిముల్లా పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇళ్ల నిర్మాణాలకు కెడిసిసి రుణాలు : తాతినేని

ప్రజాశక్తి-చల్లపల్లి : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ. 2లక్షలు చొప్పున రుణాలు ఇస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు ఛైర్పర్సన్ తాతినేని పద్మావతి తెలిపారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన పీఏసీఎస్ గిడ్డంగిని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తాతినేని పద్మావతి ముఖ్య అతిధులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సీఎం జగన్ సహకారంతో కేడీసీసీ బ్యాంకు విస్తత అభివృద్ధి సాధిస్తోందన్నారు. రైతులకు కేడీసీసీ బ్యాంకు ద్వారా, సొసైటీల ద్వారా విస్తత రుణాలు అందిస్తూ గ్రామీణ వ్యవసాయ రంగాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ వల్లూరు ఉమా, పిఏసిఎస్ ఛైర్పర్సన్ హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ,, ఎస్సీ సెల్ నాయకులు మద్దాల వీరస్వామి, పిఏసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు



గిడ్డంగిని ప్రారంభిస్తున్న తాతినేని

నేడు మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు ఉయ్యూరు, ఏజి అండ్ యస్ జి సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడు ప్రముఖ కంపెనీలతో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపిఎస్ఎస్డిసి సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సీపాన శ్రీనివాసరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మినీ జాబ్ మేళాలో హెటిరో లాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని 18 ఏళ్ళ నుండి 35 మధ్యగల డిగ్రీ, ఆపై చదువులు పూర్తిచేసిన నిరుద్యోగులు అర్హులన్నారు. యువత సదరు ఇంటర్వ్యూలకు తమ బయోడేటా, సరిఫికేట్స్, ఆధార్ కార్డ్ కాపీలతో హాజరు కావాలని చెప్పారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ 13,500 నుండి రూ 20 వెలు వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా www.apssdc.in వెబ్సైట్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7981368429, 9666615539 సంప్రదించాలన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

- రామవరప్పాడు వరకే ప్యాసింజర్ రైళ్ళు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా మచిలీపట్నం నుండి బయలు దేరే పలు ఎక్స్ప్రెస్, ప్యాసింజర్ రైళ్ళు రద్దు చేసినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ పి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 17211 మచిలీపట్నం, యశ్వంతపూర్ 23, 25, 28 తేదీలలో (3 రోజులు), 17212 యశ్వంతపూర్, మచిలీపట్నం 24, 26, 29 తేదీలలో (3 రోజులు), 07095 మచిలీపట్నం, ధర్మవరం వయా తిరుపతి 23, 25, 27, 28 తేదీలలో (4 రోజులు), 07096 ధర్మవరం, మచిలీపట్నం 24, 26, 28, 29 తేదీలలో (4 రోజులు) రద్దు చేసినట్లు తెలిపారు. అంతేకాక మచిలీపట్నం నుండి విజయవాడ వెళ్ళే పాసింజర్ రైళ్ళు నేటి నుండి 29 వ తేదీ వరకు రామవరప్పాడులో నిలిపివేస్తామని ఆయన చెప్పారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : వికలాంగుల చట్టం 2016 ను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని, జిల్లాలో వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కు వినతిపత్రం అందజేశారు.జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.లక్ష్మణరావు,ఎస్ ఎస్ నారాయణ లు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వేలాది మంది వికలాంగులు పలు సమస్యలతో బాధపడుతున్నారని ,నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.విద్య, వైద్యం ఖరీదయ్యాయని . పట్టణ ప్రాంతాల్లోఅయితే పన్నుల భారం పడుతోందన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న రూ.3వేల పింఛను ఏమూలకూ సరిపోవడంలేదన్నారు. కాబట్టి పెరిగిన ధరలకు అనుగుణంగా పింఛన్ 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వికలాంగులకు నిరుద్యోగ సమస్య వెంటాడుతోందని కాబట్టి ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో చదువుతున్న వికలాంగ విద్యార్థుల మెస్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకాల జారీని ఇటీవల నిలిపివేశారని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలింకో కంపెనీ అందించే ఉప కరణాలు వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆర్‌బికెల్లో ఎరువులు



ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని అన్ని ఆర్బీకెల్లో రైతులకు కావాల్సిన యూరియా,కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో వున్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని మండల వ్యవసాయ అధికారి జి వి శివప్రసాద్ రైతులను కోరారు.ఎరువులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ముందుగానే పరీక్షించి రైతు భరోసా కేంద్రాలకుచేరతాయని, ఎంఆర్పి ధరలకే లభిస్తాయన్నారు. రైతులు తమ ఆధార్ నెంబర్ చెప్పి వేలి తో ధ్రువీకరణ చేసి ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. దిగుమతి చేసుకునే యూరియా ధర రూ. 2450 ఉండగా సబ్సిడీ పై 266.50 రైతులకు అందిస్తూ 2183.50 ప్రభుత్వం భరిస్తుందని, రైతులు వాడే ఎరువులపై సగటున బస్తా కి 2000 రూపాయల వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తుందని, అవసరం మేరకే ఎరువులు వాడాలని కోరారు. బయట ప్రైవేట్ దుకాణాల్లో కొందరు రైతులు క్రెడిట్ పై ఎరువులు కొంటారని అలాంటి వారు ఎం ఆర్ పి కి మించి కొనకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎవరైనా ఎంఆర్పి మించి ఎక్కువ ధరకి ఎరువులు అమ్మినట్లు గా వుంటే మా దృష్టికి తీసుకొని వస్తే ఆ డీలర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన రైతుల కు తెలియచేసారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి రూ.3 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గన్నవరం మండలం చిక్కవరం గ్రామం నుండి వయా గోపవరపు గూడెం మీదుగా కొండపావులూరు వెళ్లే తారు రోడ్డు అభివృద్ధికి రూ.2.15 కోట్ల రూపాయలు, బాపులపాడు మండలం ఎం ఎన్ కే రోడ్డు నుండి వయా పెరికీడు, ఎస్ ఎన్ పాలెం, వేలేరు వరకు తారు రోడ్డు అభివృద్ధికి రూ. 60 లక్షల రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ తారు రోడ్లు గోతులు పడి ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆర్ అండ్ బి శాఖకు తాను నివేదిక ఇచ్చానని తెలిపారు. అంతేగాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి సమస్య తీసుకువెళ్లాలని ఆయన సానుకూలంగా స్పందించి ఆర్ అండ్ బి శాఖకు నిధులు మంజూరు చేయాలని చెప్పారని తెలిపారు. త్వరలో ఈ రోడ్లకు టెండర్లు పిలిచి వెంటనే పనులు చేపడతారని ఎమ్మెల్యే వివరించారు. గన్నవరం నియోజకవర్గంలో రహదారులు సరిగా లేక ఇబ్బందులు పడుతూ ఉంటే సదరు సమస్యను తనకు గాని తన కార్యాలయంలో గాని సమాచారం ఇస్తే వెంటనే పరిశీలన చేసి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకు నష్టపరిహారం కోసం వినతి


ప్రజాశక్తి-బంటుమిల్లి : జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రాన్ని సోమవారం అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాల వల్ల రైతులు,కౌలు రైతులు రెండుసార్లు ఎద జల్లారని, పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. కౌలు రైతులు ఇప్పటికే సుమారు 12 వేల రూపాయలు నష్టపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కృష్ణ జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరావు, బంటిమిల్లి మండల రైతు సంఘం సీనియర్ నాయకులు సుబ్బానం జనార్ధనరావు, రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, జెన్నావుల కన్నారావు, పుప్పాల నరసింహారావు, సిఐటియు నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, కే శ్యామలరావు తదితర రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా మెడికల్ కళాశాల పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ పి.రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం మెడికల్ కాలేజీలో సెప్టెంబర్ 1వ తేదీ నుండి తరగతులు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి సౌకర్యాల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో మెడికల్ కళాశాల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు, విద్యార్థులకు వసతి సౌకర్యాల కల్పన పనుల పురోగతి సమీక్షించారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలలో మొదటి దశ అడ్మిషన్లలో 64 మంది విద్యార్థులు చేరారని, సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు వసతి కల్పించుటకు నిర్మించిన హాస్టళ్ల, గ్యాలరీల నిర్మాణాలు పురోగతి కలెక్టర్ సమీక్షించారు. డోర్స్ విండోస్ ఫిట్టింగ్ , భవనాల వైట్ వాష్, ఫాల్ సీలింగ్, ఫ్లోర్ టైల్స్ తదితర పనులు పూర్తయ్యాయని, రోడ్లు, డ్రైన్లు దాదాపు పూర్తి కావచ్చాయని అన్నారు. విద్యార్థులు బస చేయుటకు హాస్టళ్ళలో విద్యుత్తు, తాగునీరు సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. తాగునీటి వసతి కోసం శాశ్వత పైప్ లైన్ల ఏర్పాటుకు కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు.పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలక్కుండా కళాశాల అవసరాలకు ట్యాంకర్లతో నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ను సూచించారు. మెడికల్ కళాశాల నిర్వహణకు ఇప్పటివరకు భర్తీ చేసిన పోస్టులు, భర్తీ చేయవలసినవి, ఇంకా అవసరమైన సిబ్బంది పోస్టుల వివరాలతో వెంటనే నివేదిక సమర్పించాలని కలెక్టర్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీ మెడికల్ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎస్ ఈ బలరాం రెడ్డి, ఈ ఈ. రవీంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఆశలత, మేఘ సంస్థ మేనేజర్లు జగదీష్, వెంకటేశ్వరరావు, డీ ఈ నళిని తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు ప్రణాళిక రూపకల్పన : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలకు సంబంధించి నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో నిర్వహించే పోటీలకు మాస్టర్ డేటా ద్వారా గేమ్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల నిర్వహణపై సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, క్రీడా అధ్యాపకులు, స్పోర్ట్స్ అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి యువతలో క్రీడా స్పూర్తిని వెలికితీసి జాతీయ, అక్టోబర్ 2వ తేదీ నుండి 38 రోజులపాటు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబాడీ, ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 నుండి 8వ తేదీ వరకు గ్రామ స్థాయిలో, 9 నుండి 23 వరకు మండల స్థాయిలో, 24 నుండి 29 వరకు నియోజకవర్గ స్థాయిలో, 30 నుండి నవంబర్ 3వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు.

'స్పందన' అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి, ఎస్ డి సి శివ నారాయణ రెడ్డి లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన 27 హామీలను అమలు చేసేందుకు వీలుగా సంబంధిత శాఖ అధికారులు వారి రికార్డులను ప్రతిపాదనలను తాజా స్థితిగతులను వివరిస్తూ ముఖ్య ప్రణాళిక అధికారికి వెంటనే పంపాలన్నారు .అలాగే ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సానుకూలంగా పరిష్కరించాలన్నారు.

లిడ్ క్యాప్ నిధులు సద్వినియోగానికి చర్యలు తీసుకోవాలి

లిడ్ క్యాప్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు బుల్లా త్యాగరాజు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లీడ్ క్యాప్ నిధులు దుర్వినియోగం చేసిన వారి పై చర్యలు తీసుకుని నిధులు సద్వినియోగం చేయాలని లిడ్ క్యాప్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు గుడ్లవల్లేరు మండలానికి చెందిన బుల్లా త్యాగరాజు జిల్లా కలెక్టర్ రాజా బాబు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లెదర్ పార్కు నిర్మించడానికి జిల్లాకు 5.75 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కేటాయింపులు జరగగా కష్ణా జిల్లా కేటాయించిన నిధులు మాత్రం దారి మళ్లించి దుర్వినియోగం చేశారని బాధ్యులైన వారి పైన క్రమశిక్షణ చర్యలు తీసుకొని ఆ నిధులు సద్వినియోగం చేయాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు.

అర్హులకు మాత్రమే పించన్ లు మంజూరు చేయాలి : దిరిశం బాలకోటయ్య

మండల కేంద్రమైన ఘంటసాలకు చెందిన నవ చైతన్య కళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దిరిశం బాలకోటయ్య మాట్లాడుతూ జిల్లాలో డప్పు కొట్టడం చేతకాని చాలామంది డప్పు కళాకారులుగా కార్డులు, పింఛన్లు పొందుతున్నారని, విచారణ జరిపించి నిజమైన డప్పు కళాకారులకు పింఛన్లు వచ్చేలాగా చూడాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు,డ్వామా పిడి జి.వి. సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, ముడా కార్యదర్శి సరళావతి, డిఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి, డీఈవో తహేరా సుల్తానా, డి ఎస్ ఓ పార్వతి, డిసిహెచ్ఎస్ ఇందిరా దేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సర్వే భూ రికార్డుల ఏడి రంగారావు, డిటిడబ్ల్యూఓ ఫణి ధూర్జటి, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయ్ కుమారి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రావులపాడు : సర్పంచ్



ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని రావులపాడు గ్రామపంచాయతీ అభివద్ధిలోపరవళ్ళు తొక్కుతోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఆ గ్రామ సర్పంచ్ గోళ్ళ సోమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోళ్ల మాట్లాడుతూ తను రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టినప్పటినుండి నేటి వరకు ఆ గ్రామ సర్పంచిగా మూడు విడతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, తన సతీమణి శ్రీదేవి రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికయ్యారని మొత్తంగా 5 పర్యాయాలు సర్పంచిగా ఆ గ్రామాన్ని అభివద్ధి చేస్తూ వచ్చామన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ కార్యాలయంను మండల పరిషత్ నిధులు రూ4 లక్షలతో అభివద్ధి, జగనన్న కాలనీలో 50 ఇంటి స్థలాలలో,ఇంటి నిర్మాణాలు ప్రారంభించామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కులాయి, తదితర పనులు పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సహకారముతో అభివద్ధి చేసినట్లు ఆయన వివరించారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని, అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, కష్ణాపురం గ్రామ సర్పంచ్ వీరంకి బలుసులమ్మ, పంచాయతీరాజ్ ఏఈ షరబందీ రాజు, హౌసింగ్ ఏఏ భవాని ప్రసాద్, కష్ణాపురం పశు వైద్యాధికారి ఈశ్వర్, గ్రామ కార్యదర్శి విద్యాధర్, సచివాలయ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది సుమలత ,కోమలి, అన్నామణి, విజయలక్ష్మి, మహాలక్ష్మి వైయస్సార్ పార్టీ నాయకులు శోంఠి వెంకటేశ్వరావు, కొడాలి రాంబాబు, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, సచివాలయ కన్వీనర్ పర్సా జగన్, బండ్రపల్లి శ్యామ్, మన్నే కిషోర్, కొడాలి ఏసు పాదం, మర్రి దుర్గారావు, మారపాక మహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు మేర్జా దినాయత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పరిరక్షణకు వినతి

పామర్రు: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్డు పొందిన ప్రతి కార్మికునికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్కుమార్కు భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి గోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంఎల్ఎ కార్యాలయ ప్రతినిధికి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కార్మికులకు మంజూరైన పథకాలను ఆపివేసి బోర్డును నిర్వీర్యం చేయటానికి ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులకు చట్టబద్ధంగా చెందాల్సిన పథకాలు రాయితీలను అందించకుండా, సంక్షేమ బోర్డు నిధులు రూ.1280 కోట్లు ప్రభుత్వ అవసరాలకు వాడుకొని కార్మికులకు మొండి చేయి చూపించిందన్నారు. పెండింగ్ క్లయములను విడుదల చేయాలని, ప్రభుత్వం వాడుకున్న సంక్షేమ బోర్డు నిధులను తిరిగి బోర్డుకి జమ చేయాలని, భవనిర్మాణ కార్మికుడికి 60 సంవత్సరాలు వచ్చేంతవరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేము పెద బాబు, సిహెచ్ రమేష్ పఠాన్ ఖాన్, కాకి రాజశేఖర్, ఐ రాజు. మన్నె శ్రీనివాస్ , పామర్రు, పమిడి ముక్కల, మొవ్వ, పెదపారుపూడి మండలాల కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు అరిమిల్లి రాధాకష్ణ

లోకేష్ బహిరంగ సభను జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం గన్నవరం రానున్న నేపథ్యంలో అక్కడ నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని అవనిగడ్డ నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు, తణుకు మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో రాధాకష్ణ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పే ల్లు బికుతుందని, లోకేష్ యాత్ర ఈ ప్రాంతంలో లేనందున 22వ తేదీన జరిగే బహిరంగ సభలో పార్టీ శ్రేణులంతా పాల్గొనేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మండల బాలవర్ధిరావు, మోపిదేవి జడ్పిటిసి మెడ బలిమి మల్లికార్జునరావు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు 2 లక్ష్మణరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ ప్రాంత సమస్యలు పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వన్టౌన్ : 49వ డివిజన్ కొండ ప్రాంతంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడి కార్పొరేటర్ గానీ. ఎమ్మెల్యే గానీ పట్టిచుకున్న పరిస్థితి లేదని జనసేన నగర అధ్యక్షులు, రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్ తెలిపారు. ఇంటింటికి రాబోయే జనసేన ప్రభుత్వం రెండో విడతలో భాగంగా 36వ రోజు సోమవారం 49వ డివిజన్ అధ్యక్షులు అడ్డూరి తమ్మారావు ఆధ్వర్యంలో ఫ్రైజర్పేట, శ్రీ మోటూరి హనుమంతరావు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ వద్ద నుండి ప్రారంభించి కొండ ప్రాంతంలో పోతినపర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పశ్చిమ నియోజకవర్గంలోని కొండప్రాంత అభివద్ధి పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యునిగా విధులు నిర్వహిస్తున్న పులి బాబురావు అనారోగ్య సమస్యతో బాధపడి తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్ పులి బాబురావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్ఆర్ సిపి నాయకులు నల్లమోతు రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రాఘవరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రైతుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలిచేందుకు అధికారులందరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు జెన్ను రాఘవ రావు అధికారులను కోరారు.సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు జెన్ను రాఘవరావు, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లతో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతులు లేవనెత్తిన పలు సమస్యలు, అంశాలపై అధ్యక్షులు సమీక్షించారు. అనంతరం అధ్యక్షులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వారికి కావలసిన అవసరాల గురించి జిల్లా స్థాయి అధికారులు దష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేందుకు కషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా రైతులు ఇబ్బందులు పడకుండా నీటిపారుదల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం చర్చకు వచ్చిన అంశాలపై వచ్చే సమావేశంలోగా తగిన విధంగా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉయ్యూరు లో డ్రైనేజీ కాలువల మరమ్మతు వెంటనే చేపట్టాలని ఇందుకోసం అయ్యే ఖర్చు 7 లక్షల రూపాయలను మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఉమ్మడి కష్ణా జిల్లా విభజన అయిన సందర్భంలో కష్ణా జిల్లాకు కేటాయించిన పశువుల వైద్యులను ఎన్టీఆర్ జిల్లా నుండి తిరిగి రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి డిడి మనోహర్, ఎడి మణిధర్, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి, పౌర సరఫరాల సంస్థ డిఎం శ్రీధర్, ఎల్ డి ఎం జయవర్ధన్, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డి సి ఫణికుమార్, డ్రైనేజీ ఈ .ఈ. విజయలక్ష్మి తదితర



మాట్లాడుతున్న రాఘవరావు

ఎంఎల్ఎ వంశీని కలిసిన ఎంఇఒ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండల విద్యాశాఖాధికారి ఆర్.బాలా సింగ్ గన్నవరం శాసనసభ్యులు డా.వల్లభనేని వంశీని మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. బాపులపాడు మండల విద్యాశాఖాధికారి గా పనిచేయుచున్న బాలాసింగ్కు గన్నవరం ఎం.ఈ.ఓ-1గా బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. శాసనసభ్యులు డా.వల్లభనేని వంశీని కలిసిన మండల విద్యాశాఖాధికారి విద్యాశాఖ పనితీరు పై చర్చించారు. నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి పథకాల అమలుపై నివేదిక అందించారు. విద్యాశాఖ పనితీరును, పురోగతిని వివరించారు.

నీటిమీటర్లను ఉపసంహరించుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్ ఊర్మిళానగర్, ప్రజాశక్తి నగర్ ప్రాంతంలో ఇంటింటికి నీటి మీటర్ల బిగింపుకు ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్లను సిపిఎం పశ్చిమ సిటీ బందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, చెత్త పన్నులతో ఇబ్బంది పడుతున్న తమపై మరలా నీటి మీటర్ల భారాలు మోపడం అన్యాయమని వాపోయారు. అనంతరం కార్పొరేటర్ సత్యబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విజయవాడ నగరంలో నీటి మీటర్ల రద్దుపై మాట తప్పిందన్నారు. కష్ణానది కూత వేట దూరంలో ఉన్నా నీటి మీటర్లు బిగించి సొమ్ము చేసుకోవడం అనాగరికమైన చర్య అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం మధురానగర్ ప్రాంతంలో నీటి మీటర్ల విషయమై కౌన్సిల్లో ప్రస్తావించినప్పుడు బిగించలేదని బుకాయించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు సిపిఎం ఛాలెంజ్‌కి సిద్ధపడకుండా తోక ముడిచారని తెలిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ భాగ్యలక్ష్మి వెంటనే స్పందించి పశ్చిమలో నీటి మీటర్ల ప్రక్రియను నిలువుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం నగర కమిటీ నాయకులు జి. వెంకట్రావు, ఎస్కే మస్తాన్, కె.అంజిబాబు, అప్పలరాజు, కాంతారావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యబాబు, సిపిఎం నాయకులు


పురుగు మందులను విడుదల చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

మార్కెట్లోకి 'కట్లాస్' విడుదల

విజయవాడ: వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ భారతీయ బహుళజాతి సంస్థ పారిజాత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించబడిన కీటకనాశిని 'కట్లాస్' పురుగుల మందును హోటల్ వి రాయల్ పార్క్‌లో సోమవారం మార్కెట్లోకి విడుదల చేశారు. అలాగే వరిలో కలుపునాశిని 'దహన్', వాణిజ్య పంటలో వచ్చే కీటకాల నివారణకు 'అబాదన్'లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సౌత్ డిజియం యు.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల క్రిమిసంహారక మందులతో పాటు మొక్కలకు పోషకాలు అందించే ఉత్పత్తుల పోర్ట్ఫోలియో పారిజాతంను ప్రత్యేకంగా పేర్కొన్నారు. జోనల్ హెడ్ ఎ.రమణారెడ్డి మాట్లాడుతూ మిరప పంటలో నల్లి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దాని నివారణలో కట్లాస్ సమర్ధవంతంగా పనిచేస్తూ దీర్ఘకాలం పాటు పంట నియంత్రించటమే కాకుండా పంటకు పూర్తి సంరక్షణ ఇస్తుందని తెలిపారు.

యువగళం విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-వన్‌టౌన్: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నగరంలో విజయవంతం అయ్యిందని, ఆయనకు నగర ప్రజలు బ్రహ్మరథం పట్టారని 48వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పేరాబత్తుల రమణ అన్నారు. యువగళం పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, తెలుగుదేశం పార్టీకి, లోకేష్‌కు తమ మద్దతును తెలియచేస్తున్నారని అన్నారు. ఎక్కడకు వెళ్లినా లోకేష్ ప్రభంజనం సృష్టిస్తుండటంతో వైసీపీ నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేవారు. వైసీపీ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.


లోకేష్‌తో పేరాబత్తుల రమణ




యువగళం పాదయాత్రలో భాగంగా నిడమానూరు క్యాంపు సైట్‌లో మగ్గం నేస్తున్న లోకేష్, వృత్తిదారులతో లోకేష్